
సాక్షి
గుంటూరు
శనివారం । 27 । సెప్టెంబర్ । 2025





## పీహెచ్‌సీలో టీబీ అధికారి తనిఖీలు

రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. పరిసరాలు, రికార్డులను పరిశీలించారు.



## పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ఎగువ నుంచి 2,50,865 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 2,79,998 క్యూసెక్కులు వదులుతున్నారు.



## దుర్గమ్మ సేవలో మండలి చైర్మన్

వించిపేట(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను శుక్రవారం రాష్ట్ర శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## న్యూస్‌రీల్

### మహాలక్ష్మీ దేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: శ్రీదేవీ శరన్నవరాత్ర్యుత్సవాలలో భాగంగా అమరావతిలోని బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శుక్రవారం బాల చాముండేశ్వరి అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవీ ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీ చక్రార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దిని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని కోదండ రామాలయంలో అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు.

**అన్నదానానికి రూ.లక్ష విరాళం**

శ్రీ బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో నిత్యం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి గుంటూరుకు చెందిన చతుర్వేదుల శ్రీనివాసశాస్త్రి లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి రేఖకు అందజేశారు.

### ప్రాజెక్టుల పూర్తికి సహకారం అందిస్తా

పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



నరసరావుపేట: జిల్లాలో నిర్మిస్తున్న వరికెపూడిశెల, పోలవరం-బనకచర్ల ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేందుకు తన వంతు సహకారం అందిస్తానని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు భరోసా ఇచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అవసరమయ్యే అనుమతుల కోసం నిరీక్షించకుండా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వరికెపూడిశెల ప్రాజెక్టుకు సంబంధించి అలైన్‌మెంట్ ఫిక్సింగ్‌ను వారం రోజుల్లోగా పూర్తిచేసి ల్యాండ్ ప్లాన్ షెడ్యూళ్లను తయారు చేయాలని తెలిపారు. వరికెపూడిశెల ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకటరత్నం, పోలవరం-బనకచర్ల ప్రాజెక్ట్ ఈఈ శివరాంప్రసాద్, డీఈలు శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఏఈలు వెంకటేశ్వర్లు, శంకరాచారి పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ

నరసరావుపేట: పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 12గంటలకు వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### ఓటీపీ విధానంతో ఆస్తులకు రక్షణ



మంగళగిరి: ఓటీపీ విధానంతో ప్రజల ఆస్తులకు రక్షణ ఉంటుందని రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ బి.ఆర్. అంబేడ్కర్ తెలిపారు. నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రవేశపెట్టిన ఓటీపీ విధానం ద్వారా నకిలీ రిజిస్ట్రేషన్‌కు అడ్డుకట్టపడటంతో పాటు ప్రజల ఆస్తులకు భద్రత పెరుగుతుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో వచ్చిన మార్పులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా రిజిస్టార్ శైలజ, విజయవాడ డీఐటీ రవీంద్ర, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ బాలగురవయ్య పాల్గొన్నారు.



పెదనందిపాడులో 'ధన' కనకదుర్గగా..



చల్లావారిపాలెంలో ..



పెదకాకాని శివాలయంలో..



చేబ్రోలులోని మార్కెట్టు సెంటర్‌లో..

## మహాలక్ష్మీ నమస్తుతే !

దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం అమ్మవారు పలు ఆలయాల్లో ధనలక్ష్మిగా దర్శనమిచ్చింది. చేబ్రోలు ముట్లూరు రోడ్డులోని మార్కెట్టు సెంటర్‌లో రూ.25లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని భక్త బృందం ప్రత్యేకంగా అలంకరించింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. గుంటూరు రూరల్ మండలంలోని నల్లపాడు, చల్లావారిపాలెం గ్రామాల ప్రజల ఇలవేల్పు అయిన ఘంటాలమ్మ తల్లి, పుట్టలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చారు. పెదనందిపాడులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారు 'ధన కనకదుర్గ'గా భక్తులకు దర్శనమిచ్చింది. ప్రత్యేక మండపంలో కొలువు దీరిన అమ్మవారిని రూ. 99,99,999తో మహాలక్ష్మిగా అలంకరించారు.

– పెదకాకాని/చేబ్రోలు/ గుంటూరు రూరల్/ ప్రత్తిపాడు



ఇంద్రకీలాద్రికి భక్తులు వెల్లువలా తరలివస్తూనే ఉన్నారు. ఎండా వానను లెక్కచేయక, కాలి నడకన కొండెక్కి అమ్మ దర్శనం చేసుకుని తరిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం ఆత్మస్థైర్యంతో అడుగులు వేస్తూ సునాయాసంగా నడిచేసి భక్తిప్రపత్తులు చాటుకుంటున్నారు. శుక్రవారం అష్టలక్ష్మీ సమష్టి రూపమైన శ్రీమహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ కొలువయ్యారు. భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులు సిరుల తల్లిని కనులారా వీక్షించారు. మా కల్పవల్లివి నీవే తల్లి అంటూ అంటూ ఐశ్వర్యసిద్ధి కోసం ప్రార్థించారు.



అమ్మవారి దర్శనం అనంతరం కిందికి వస్తున్న భక్తులు, (ఇన్‌సెట్లో) మహాలక్ష్మీ అలంకరణలో దుర్గమ్మ



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణి

# సిరివర్షిణీ.. శిరసా నమామి

- మహాలక్ష్మీదేవిగా కొలువుదీరిన దుర్గమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు
- పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ శుక్రవారం శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం పైగా శ్రీమహాలక్ష్మీదేవి అలంకారం కావడంతో తెల్లవారుజామున నుంచే భక్తుల రద్దీ కనిపించింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒడిశాల నుంచి భక్తుల రాక ప్రారంభమైంది. దీంతో క్యూలైన్‌లో రద్దీ ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. ఉదయం 6 గంటలకే సర్వ దర్శనం, రూ.100, రూ.300 టికెట్ల క్యూలైన్లు దేవస్థాన ఘాట్‌రోడ్డులోని టోల్‌గేట్ వరకు చేరాయి. మారిన టైం స్లాట్ మేరకు శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, రాత్రి 7 గంటలకు వీఐపీలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక మిగిలిన సమయంలో అంతరాలయ గేట్లకు ఆలయ అధికారులు తాళాలు వేశారు. వీఐపీ టైం స్లాట్ మినహా మిగిలిన సమయంలో వచ్చిన వారికి బంగారు వాకిలి దర్శనం కల్పించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ప్రాంగణానికి వీఐపీలు రాకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు కట్టుదిట్టం చేశారు. ప్రత్యేక కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీయాగంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టినట్లు భక్తులు పేర్కొంటున్నారు. రూ. 100, రూ. 300 టికెట్లు క్యూలైన్‌లో సైతం గంటన్నరకు పైగా సమయం పడుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కుంకుమ పూజల్లో పాల్గొన్న దంపతులు

**కాణిపాకం దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు**

దుర్గమ్మకు కాణిపాకం దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈవో పెంచల కిశోర్, స్థానాచార్యులు ఫణీంద్రస్వామిలతో పాటు ఎమ్మెల్యే కె. మురళీమోహన్ పట్టువస్త్రాలతో దుర్గ గుడికి విచ్చేశారు. అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

### మహాలక్ష్మీ సేవలో గవర్నర్లు

మహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి విడివిడిగా దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆలయానికి చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి హరిజవహర్‌లాల్, కమిషనర్ రామచంద్రమోహన్ సాదరంగా స్వాగతం పలకగా, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టుచీర, పూలు, పండ్లు, పూజా సామగ్రిని సమర్పించారు. వేద ఆశీర్వచనం, అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలు, చిత్రపటాన్ని గవర్నర్‌కు అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్‌కమిషనర్ రాజశేఖరబాబు, జేసీ ఎస్.ఇలక్కియ పాల్గొన్నారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి దంపతులకు ఈవో స్వాగతం పలుకగా.. అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి ఆయనతో పాటు ఉన్నారు.

**90 వేల మంది దర్శనం..**

మహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మను శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు సుమారు 90 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. 5వ రోజు దేవస్థానానికి రూ. 28.21లక్షల మేర ఆదాయం సమకూరిందని చెప్పారు. లడ్డూల ప్రసాదం విక్రయం ద్వారా రూ. 2.86లక్షలు, ఆరు లడ్డూ బాక్స్ ప్యాక్ విక్రయం ద్వారా రూ. 23.58లక్షలు, ఆర్జిత సేవా టికెట్లు, తలనీలాల టికెట్ల విక్రయం ద్వారా 1.75 లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. ఇక అమ్మవారి అన్న ప్రసాదాన్ని 23,656 మందికి పంపిణీ చేసినట్లు వివరించారు.

### ఇంద్రకీలాద్రిపై నేడు

- తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనం
- ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 7 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక చండీయాగం(యాగశాల)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన(లక్ష కుంకుమార్చన వేదిక)
- సాయంత్రం 5 గంటలకు శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి నగరోత్సవ సేవ
- సాయంత్రం 5 గంటలకు మహా మండపం ఆరో అంతస్తులో అర్చక సత్కార సభ
- సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి మహా నివేదన, పంచహారతుల సేవ, వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

### ఉత్సాహం.. ఆనందం..

సాయం సంధ్య వేళ ఆహ్లాదకర వాతావరణంలో ఆది దంపతులైన శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన నగరోత్సవం కనుల పండువగా సాగింది. మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద యాగశాలలో ఆది దంపతులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. మహామండపం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాట నృత్యాలు, డప్పు కళాకారులు విన్యాసాలతో నగరోత్సవం ముందుకు సాగింది. అమ్మవారిని దర్శించుకుని కొండ దిగువకు చేరుకున్న భక్తులు ఆదిదంపతుల నగరోత్సవంలో పాల్గొని తరించారు.



# పవన్ కల్యాణ్ మౌనంతో కాపుల్లో ఆవేదన

- బాలకృష్ణ దురుసు వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి, నాగబాబులు ఎందుకు స్పందించరు ?
- వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



పొన్నూరు: ప్రముఖ సినీ నటుడు, తన అన్న చిరంజీవిని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అవమానించేలా దారుణంగా మాట్లాడినా ఆయన సోదరుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించక పోవడం చిరంజీవి అభిమానులు, కాపు నాయకులను ఆవేదనకు గురిచేస్తోందని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. అంతటి అవమానం జరిగినా తన స్వార్థ రాజకీయం కారణంగానే పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గుంటూరులోని తన కార్యాలయంలో అంబటి మురళీ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే బాలకృష్ణ సైకో అనడం, అదేవిధంగా సినీ పరిశ్రమలోనే దిగ్గజ నటుడు చిరంజీవిని అవమానించే విధంగా మాట్లాడటం ఎంతో బాధను కలిగించిందన్నారు. వై.ఎస్.జగన్, చిరంజీవిలను అభిమానించే వ్యక్తిగా ఈ వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నానన్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలపైన పవన్ కళ్యాణ్, నాగబాబుల నుంచి ఎందుకు స్పందన లేదని సూటిగా ప్రశ్నించారు. నాగబాబు, పవన్ కళ్యాణ్‌లు ఈ స్థాయిలో ఉండటానికి కారణమైన వ్యక్తి చిరంజీవి అనే విషయాన్ని సోదరులు ఇద్దరూ గుర్తించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చిరంజీవికి ఉన్న తమ్ముళ్లందరూ మాట్లాడుతుంటే, వారెందుకు నోరు మెదపరని ప్రశ్నించారు. చిరంజీవిపై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు కూటమి విధానాలా.. చంద్రబాబు విధానాల అనే అంశాన్ని పవన్ కళ్యాణ్, నాగబాబులు ప్రశ్నించాలన్నారు. దీనిని ప్రజలకు సైతం తెలియజెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన చిరంజీవిని అవమానించడం ద్వారా ఆ సామాజిక వర్గాన్నే అవమానించిన భావన ప్రతి ఒక్కరిలో కలుగుతోందన్నారు. దీనిపై రక్తం పంచుకుపుట్టిన తమ్ముళ్లుగా నిలదీస్తారో.. లేక పదవుల కాంక్షతో కప్పిపుచ్చుతారో అది నాగబాబు, పవన్ కళ్యాణ్‌ల విజ్ఞతకే వదిలి పెడుతున్నానన్నారు.

### నేటి నుంచి నాటక, నాటిక పోటీలు



తెనాలి: కళల కాణాచి- తెనాలి, ఆర్‌ఎస్‌ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో జాతీయ స్థాయి పంచమ పద్యనాటక, సాంఘిక నాటక, నాటికల పోటీలు శనివారం ఆరంభం కానున్నాయి. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఉదయం 10.30 గంటలకు పద్యనాటకం, మధ్యాహ్నం 2.30 గంటలకు పద్యనాటకం, సాయంత్రం 5.15 గంటలకు ప్రారంభసభ, రాత్రి 7.15 గంటలకు సాంఘిక నాటక ప్రదర్శనలు ఉంటాయి. తర్వాతి రోజు నుంచి ఉదయం నుంచి రాత్రివరకు ప్రదర్శనలు కొనసాగుతాయి. పోటీల ఆహ్వానపత్రికను కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా శుక్రవారం ఆవిష్కరించారు. వీణాఅవార్డ్స్ నాటకపోటీలకు అనేక సంస్థల నుంచి స్పందన వచ్చిందన్నారు. పద్య నాటకాలు-9, సాంఘిక నాటకాలు-5, సాంఘిక నాటికలు-7 కలిపి మొత్తం 21 ప్రదర్శనలు ఉంటాయన్నారు. సినీనటుడు వేమూరి విజయభాస్కర్ మాట్లాడుతూ భారీస్థాయిలో జరుగుతున్న పోటీల నిర్వహణ వ్యయప్రయాసలతో కూడుకున్నదని చెప్పారు.

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,500 గరిష్ఠం : రూ. 2,300

మోడల్ ధర రూ. 1,900



## పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 134

కొమ్ములు : 65 బస్తాలు

(ధర రూ॥ల్లో)

| కనిష్ఠ : | గరిష్ఠ : | మోడల్ : |
|---|---|---|
| 9,000 | 10,350 | 10,350 |

కాయలు : 216 బస్తాలు

| కనిష్ఠ : | గరిష్ఠ : | మోడల్ : |
|---|---|---|
| 9,000 | 10,350 | 10,325 |

మొత్తం అమ్మకాలు : 100.50 క్వింటాళ్లు

## మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)

| | |
|---|---|
| వచ్చిన బస్తాలు | 19,406 |
| అమ్మకాలు | 23,715 |
| నిల్వ | 4,387 |



**నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)**

| | |
|---|---|
| 334 | 10,500–14,300 |
| నంబరు-5 | 10,000–14,100 |
| 273 | 10,500–13,500 |
| 341 | 10,000–15,000 |

**ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)**

| | |
|---|---|
| 334 | 10,500–14,400 |
| నంబరు-5 | 10,000–14,200 |
| 341 | 10,000–15,200 |
| 4884 | 10,000–13,500 |

**నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)**

| | |
|---|---|
| తేజ | 10,000 – 14,500 |
| బాడిగ–355 | 10,000 – 15,000 |
| దేవనూరు డీలక్స్ | 10,000 – 14,000 |
| ఆర్మూర్ | 9,800 – 12,000 |
| తాలుకాయలు | 6,000 – 7,000 |

**ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)**

| | |
|---|---|
| తేజ | 10,000–14,700 |
| బాడిగ – 355 | 10,000–14,900 |
| దేవనూరు డీలక్స్ | 10,500–14,200 |
| తాలు | 5,200 – 7,000 |

–కొరిటెపాడు (గుంటూరు)

# డీఎస్సీ ఉపాధ్యాయులకు తప్పిన ప్రమాదం

- నేషనల్ హైవేపై ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ఆటోలో ఉన్న ఒకరికి స్వల్ప గాయాలు



ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో సైడు కాలువలోకి పడిపోయిన ఫర్నీచర్ లోడ్ ఆటో

**ప్రత్తిపాడు:** హైవేపై పెను ప్రమాదం తప్పింది. మార్జిన్‌లో నిలిపి ఉంచిన ఫర్నీచర్ లోడ్ ఆటోను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 40 మంది డీఎస్సీ ఉపాధ్యాయులకు ప్రమాదం తప్పిపోవడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా అచంట మండలం కొండమంచిలి గ్రామానికి చెందిన మానూరి త్రినాథ్ గత కొంతకాలంగా విజయవాడలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 25వ తేదీ రాత్రి త్రినాథ్ తన మేనల్లుడు పాదిలి మోషేకుతో కలసి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నుంచి ట్రాలీ ఆటోలో కుర్చీల లోడుతో తిరుపతికి బయల్దేరాడు. మార్గమధ్యలో అర్ధరాత్రి సమయంలో ఆటో నడుపుతున్న మహేష్ కాలకృత్యాల కోసం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం సమీపంలో పదహారో నంబరు జాతీయ రహదారిపై మార్జిన్‌లో ఆటో నిలిపాడు. తర్వాత కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఇటీవల డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన సుమారు 40 మంది ఉపాధ్యాయులతో గుంటూరు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న కనిగిరి డిపో ఆర్టీసీ బస్సు వేగంగా ఆ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఆటోలో ఉన్న త్రినాథ్‌తోపాటు ఆటో కూడా సైడు కాలువలోనికి దూసుకుపోయింది. ప్రమాదంలో ఆటో పూర్తిగా దెబ్బతినగా, త్రినాథ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఉన్న 40 మంది డీఎస్సీ ఉపాధ్యాయులకు ఎలాంటి నష్టం జరగలేదు. వీరంతా గురువారం రాజధానిలో జరిగిన సీఎం సభకు హాజరై రాత్రికి తిరుగు పయనమయ్యారు. త్రినాథ్‌ను చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్. నరహరి తెలిపారు.

# బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆళ్ల ఉత్తేజ్ రెడ్డి

**పట్నంబజారు:** అసెంబ్లీ సాక్షిగా నటుడు చిరంజీవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిలపై ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి ధ్వజమెత్తారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో యువజన విభాగం నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కనీస విజ్ఞత లేకుండా సభా మర్యాద తెలియని బాలకృష్ణ తాను బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న మద్యాన్ని తాగి వ్యాఖ్యలు చేసినట్లు అనిపిస్తోందని విమర్శించారు. మాజీ సీఎం వై.ఎస్.జగన్ ద్వారా ఎంతో లబ్ధి పొందిన విషయాన్ని గుర్తించాలన్నారు. బసవతారకం హాస్పిటల్‌కు సంబంధించి పెండింగ్ బిల్లులను టీడీపీ హయాంలో ఇవ్వకపోతే, స్వయంగా వై.ఎస్.జగన్ వాటిని విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. బాలకృష్ణ ఇంట్లో కాల్పులు జరిగితే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వెంటనే రాజకీయం చేయకుండా బాలకృష్ణ జీవితాన్ని కాపాడిన విషయాన్ని గుర్తుచేశారు. తండ్రిపై చెప్పులు వేయించిన వ్యక్తితో పయనిస్తున్న బాలకృష్ణకు, తండ్రి ఆశయాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వై.ఎస్.జగన్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీ యువజన విభాగం నగర అధ్యక్షుడు యేటి కోటేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ సినిమా వాళ్లను అవమానించారంటూ పిచ్చి బట్టిన వ్యాఖ్యలు చేస్తూ వై.ఎస్.జగన్‌పై కూటమి నేతలు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేశారన్నారు. ప్రజా సమస్యలు చర్చించిన పాపాన పోలేదని మండిపడ్డారు. సినిమా డైలాగులు చెప్పడం తప్ప, కనీసం మాట్లాడలేని బాలకృష్ణ ఒక సైకో అని మండి పడ్డారు సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేతలు వేలూరి అనిల్‌రెడ్డి, కానూరి శశిధర్, వెంకటేష్‌రెడ్డి, దానం వినోద్ పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి పెద్దపీట

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు వెస్ట్:** నగరపాలక సంస్థ పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు మంచినీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించడంతోపాటు అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. గుంటూరు నగరంలో ఇటీవల కొన్ని ప్రాంతాలలో డయేరియా కేసులు పెరగడంతో జాగ్రత్త చర్యలు కీలకం అన్నారు. వైద్యసహాయం అందించటం ద్వారా సకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా అరికట్టడం సాధ్యమైందన్నారు. భారీ వర్షాలు, తదితర కారణాల వల్ల నగరంలో డయేరియా వ్యాధి సోకినట్లు తెలిసిందన్నారు. డయేరియా నియంత్రణకు కృషి జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ డయేరియా నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. హై రిస్క్ ప్రాంతాల్లో తాగునీటికి పూర్తి స్థాయిలో పరీక్ష నిర్వహించడంతోపాటు సురక్షితమైన గునీటిని ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో ప్రజలకు పూర్తిస్థాయిలో రక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. పైపు లైన్లు ఇబ్బంది ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

## 16 మండలాల్లో తేలికపాటి వర్షం

**కొరిటెపాడు(గుంటూరు):** గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 16 మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. అత్యధికంగా పెదకాకాని మండలంలో 15.2 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.8 మి.మీ పడింది. సగటున 5.5 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు పశ్చిమలో 12.2, గుంటూరు తూర్పు 9.2, ఫిరంగి పురం 8.4, కొల్లిపర 8.2, దుగ్గిరాల 6.8, తుళ్ళూరు 6.8, చేబ్రోలు 6.2, తెనాలి 6.2, తాడికొండ 4.2, పెదనందిపాడు 3.8, మేడికొండూరు 3.4, తాడేపల్లి 3.4, కాకుమాను 2, మంగళగిరి మండలంలో 1.8 మి.మీ. చొప్పున పడింది. సెప్టెంబర్ 26వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 138.1 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 258.5 మి.మీ.గా నమోదైంది.

## ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

**గుంటూరు ఎడ్యుకేషన్:** సదరన్ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్పీఎల్‌టీవో) ఆధ్వర్యంలో అక్టోబర్ 26న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పయర్ల నాగయ్య, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 5వ తేదీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంతో పాటు అక్టోబర్ 15న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల డైరెక్టర్లు, కరస్పాండెంట్లు, అధ్యాపకులు, ఆచార్యుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. వివరాలకు 99499 29674, 79890 88274 ఫోను నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

## 29న అమరావతిలో 'జాబ్ మేళా'

**తాడికొండ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్డీఏ సౌజన్యంతో సెప్టెంబర్ 29న ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఆర్డీఏ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అమరావతి పరిసర ప్రాంతాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. వివరాలకు గ్రామంలోని శంకర్ 98484 24207, శ్రీకర్ 99634 25999 ఫోను నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## మీడియా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా అవుతు సునీత


**మంగళగిరి:** నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు అవుతు సునీతను వైఎస్సార్ సీపీ మీడియా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆమెను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

# నియంత్రణలోనే డయేరియా

– జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

**గుంటూరు వెస్ట్:** జిల్లాలో అతిసార వ్యాధి నియంత్రణలో ఉందని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం జిల్లా కలెక్టర్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 177 కేసులు నమోదు అయ్యాయన్నారు. గుంటూరు నగరం నుంచి 152 కేసులు రాగా, గ్రామీణ ప్రాంతం నుంచి 25 కేసులు నమోదు అయ్యాయని చెప్పారు. ఆయా ప్రాంతాలకు ప్రత్యేక అధికారులను నియమించి, నిశితంగా పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 91 మంది చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. నియంత్రణ చర్యలు పూర్తి స్థాయిలో చేపట్టామని వివరించారు. 120 ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లను గుంటూరులో తనిఖీ చేయగా, 21 చోట్ల హానికారక బ్యాక్టీరియాను గుర్తించామన్నారు. వాటిని తక్షణం సీజ్ చేశామని వివరించారు. గ్రామీణ ప్రాంతంలో 140 ప్రైవేట్ ప్లాంట్లను తనిఖీ చేయగా.. 16 చోట్ల నీరు కలుషితం జరిగినట్లు గుర్తించామని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. దాదాపు 8 వేల గృహాలలో సర్వే చేశామన్నారు. సాధారణ నీటి సరఫరాను నిలిపి, అవసరమైన చోట ప్రత్యేకంగా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

# 97 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు



రిటర్నబుల్ ప్లాటు పత్రాలు అందిస్తున్న దృశ్యం

**తాడికొండ:** అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక (జరీబు, మెట్ట), మల్కాపురం(ప్రత్యామ్నాయ ప్లాట్లు) గ్రామాల రైతులకు శుక్రవారం విజయవాడలోని ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో ఈ–లాటరీ విధానంలో 97 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 41 నివాస ప్లాట్లు కాగా, 36 వాణిజ్య ప్లాట్లు, 20 ప్రత్యామ్నాయ ప్లాట్లు ఉన్నాయి. మొత్తంగా 56 మంది రైతులు, భూయజమానులకు ప్లాట్లను కేటాయించారు. అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. డైరెక్టర్(ల్యాండ్స్)/స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్- క్యాపిటల్ సిటీ) ఎన్‌వీఎస్‌బీ వసంతరాయుడు మాట్లాడుతూ రైతులకు భౌగోళికంగా ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జి.ఐ.ఎస్. సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. రుసుము వసూలు చేయబడదని రైతులు గమనించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.జి.చిన్ని కృష్ణ, బి.సాయి శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

# విజ్ఞాన్ కళాశాలలో దసరా సంబరాలు



పూజల్లో విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య

**గుంటూరు రూరల్:** శక్తి స్వరూపిణి దుర్గాదేవి అని విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. ప్రతి సంవత్సరం తొమ్మిది రోజులు అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి కళాశాలలో పూజిస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ సంవత్సరం 11 రోజులపాటు పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవీ నవరాత్రులలో మొదటి రోజు అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా పూజించగా, అయిదో రోజున మహాలక్ష్మి దేవిగా గురువారం అలంకరించారని పేర్కొన్నారు. ప్రత్యేక పూజలనంతరం విద్యార్థులకు దర్శనం కలిపించారు. ఎనిమిదో రోజు సరస్వతి దేవిగా అలంకరణ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులకు బతుకమ్మ, దసరా వేషధారణ, దాండియా, సంప్రదాయ వస్త్రధారణ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గౌడ్‌గా కుల ధ్రువీకరణ పత్రం అందించాలి



మాట్లాడుతున్న మురళీగౌడ్

**పెదకాకాని:** ప్రభుత్వం గౌడ కులస్తులందరికీ గౌడ్‌గా కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడంతోపాటు సంక్షేమ పథకాలకూ పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యామా మురళీగౌడ్ అన్నారు. గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్డులో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి బీజేపీ ఓబీసీ విభాగ అధ్యక్షుడు అనుమోలు ఏడుకొండలు గౌడ్ అధ్యక్షత వహించారు. మురళీగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గౌడ సామాజిక వర్గానికి పలు పేర్లతో కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తోందన్నారు. భవిష్యత్‌లో ఇబ్బందులు పడకుండా అందరికీ గౌడ్ (బీసీ–బీ) పత్రాలు మంజూరు చేయాలన్నారు. సంఘం నాయకులు యడవల్లి కొండలు, కుక్కల రాంప్రసాద్, బెజవాడ మల్లికార్జున్, యోకరాల రాము, ఎరుకల వెంకట్రావు, యడవల్లి సైదారావు, తుళ్ళూరు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల 'స్వచ్ఛతా హీ సేవ'



కిట్లు అందజేస్తున్న ప్రమోద్‌కుమార్ రెడ్డి

**కొరిటెపాడు:** స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు పలు శుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ రెడ్డి తెలిపారు. గుంటూరు శ్యామలానగర్ పార్కులో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం, ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. వారికి విధుల్లో ఉపయోగపడేలా ప్రత్యేకమైన కిట్లను అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు, సమాజ అభివృద్ధికి పరిశుభ్రత అత్యంత అవసరమని పేర్కొన్నారు. పరిశుభ్రతకు కార్మికులు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి కృషి ప్రశంసనీయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



## చెస్‌తో నిర్ణయ సామర్థ్యాలు పెరుగుతాయి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



ఎంఆర్ లలిత్‌బాబుతో గేమ్ ఆడుతున్న పెమ్మసాని

**చేబ్రోలు:** చెస్ ఆట వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, నిర్ణయ సామర్థ్యాలను పెంపొందిస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరుగుతున్న 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల కార్యక్రమంలో శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొన్న పెమ్మసాని ముందుగా గ్రాండ్ మాస్టర్ ఎంఆర్ లలిత్‌బాబుతో ఒక ఎత్తు వేసి ఆటను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహాభారతం కాలం నుంచి భారతదేశానికి చెస్ క్రీడలో గొప్ప మేధో సంపద, వారసత్వం ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు, అధిపతులు పాల్గొన్నారు. అక్టోబర్ 2 వరకూ ఈ పోటీలు జరుగుతాయి.

**5 రౌండ్లు ముగిసే సమయానికి పోటీల తీరిది..**

- నాలుగుసార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచిన జీఎం కృష్ణన్ సశికిరణ్, రైల్వేల అత్యధిక రేటింగ్ కలిగిన ఐఎం అరోన్యక్ ఘోష్తో కలిసి ఐదు రౌండ్లలో ఐదు పాయింట్లతో అగ్రస్థానంలోకి దూసుకువెళ్లారు.
- తరువాతి స్థానంలో తొమ్మిదిమంది ఆటగాళ్లు 4.5 పాయింట్లతో పోటీలో కొనసాగుతున్నారు.
- ఐదుసార్లు జాతీయ విజేత జీఎం అభిజీత్ గుప్తా, తమిళనాడు చాంపియన్ బి.విజయేష్‌పై ఏడో వరుసలో శక్తివంతమైన పాన్ ఆధిక్యంతో సులభ విజయం సాధించాడు.
- ఆంధ్ర ఆటగాడు, రైల్వేల ఐఎం ఎస్.రవితేజ, ప్రపంచ అమెచ్యూర్ రజత పతక విజేత ఏ.కుమారేష్ (తమిళనాడు)పై విజయం సాధించాడు.

## ఎన్‌ఆర్‌ఐ కోటా పీజీ కోర్సులకు దరఖాస్తు తేదీ పొడిగింపు

**గుంటూరు రూరల్:** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 2025–26కి గాను ఎన్‌ఆర్‌ఐ కోటా, ఇన్‌లై ఆఫ్ ఎన్‌ఆర్‌ఐ కోటాలో ఎమ్మెస్సీ, ఎంబీఏ (ఏబీ), ఎంటెక్, పీహెచ్‌డీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 24వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వి.రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్టోబర్ 24వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు 'రిజిస్ట్రార్, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిపాలన విభాగం, లాం గుంటూరు 522005' చిరునామాకు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రత్తిపాడు:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన నల్లూరి శ్రీనివాసరావు (50) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తుమ్మలపాలెం నుండి చిలకలూరిపేట వైపు పదహారవ నంబరు జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో ఆటోలో వేగంగా వెళుతున్నాడు. వాహనం అదుపుతప్పి సర్వీసు రోడ్డులో ఉన్న ప్రహరీని బలంగా ఢీకొట్టింది. శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్తిపాడు ఎస్‌ఐ ఎన్.నరహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటం – వడ్డేశ్వరం మధ్య బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున డ్రైనేజీ కాలువలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనపై తాడేపల్లి పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడిని తాడేపల్లి పట్టణ పరిధిలోని సలాం హోటల్ సెంటర్‌కు చెందిన కొర్రపాటి సాల్మన్ రాజు(66)గా గుర్తించారు. సాల్మన్ రాజు భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఖాజావలి శుక్రవారం అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. ఆరుగురితో కలసి చేపల వేటకని ఇప్పటం – వడ్డేశ్వరం మధ్య బకింగ్‌హామ్ కెనాల్‌కు సాల్మన్ రాజు వెళ్లాడు. మార్గమధ్యలో ఏడుగురూ భోజనం చేశారు. తర్వాత ఆరుగురు చేపల వేటకు వెళ్లారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సాల్మన్ రాజు తమ వెంట రాలేదని మిగిలిన వారు తెలిపారు. డ్రైనేజీలో పడితేనే తన భర్త ఎలా చనిపోతాడని భార్య అనుమానం వ్యక్తం చేశారు.

## అక్టోబర్ 27న జిల్లా పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం

**నరసరావుపేట ఈస్ట్:** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పల్నాడు జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం అక్టోబర్ 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి సి.సి.ఆదెయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సంఘంలో సభ్యత్వం గల ప్రతి ఒక్క పెన్షనర్ హాజరై విజయవంతం చేయాలని కోరారు. వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిన సంఘ సభ్యులు సమావేశానికి హాజరై నూతన కార్యవర్గం ఎన్నికలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.